క్లుప్తంగా

రికార్డులు అప్‌డేట్ ఉండాలి



మానవపాడు: రికార్డులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ ఉండాలని సిబ్బందిని ఎంపీడీఓ రమణారావు ఆదేశించారు. బుధవారం మండలంలోని కొర్విపాడు, చంద్రశేఖర్‌నగర్ గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్‌లు నిర్లక్ష్యంగా వ్యవహరించరాదన్నారు. గ్రామాలలో నర్సరీలలో మట్టిని నింపాలని పేర్కొన్నారు. ఆయా గ్రామాల రికార్డులను అప్డేట్ ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు సమయ పాలన పాటించాలి



గద్వాల అర్బన్: అంగన్‌వాడీ టీచర్లు ఐసీడీఎస్‌కు సంబంధించిన యాప్‌లలో చిన్నారులు వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని సీడీపీఓ హేమలత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లకు ఎన్‌హెచ్‌టీఎస్, చిన్నారుల పోషణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు సమయ పాలన పాటించాలని సూచించారు. చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా అందజేయాలని, సమర్థవంతంగా విధులు నిర్వహించాలన్నారు.

పైపులైన్ లీకేజీకి మరమ్మతులు



సాక్షి ఎఫెక్ట్..

ధరూరు: లీకైన మిషన్ భగీరథ తాగు నీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టారు. వారం రోజులుగా మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో తాగునీటి పైపులైన్‌కు లీకేజీ ఏర్పడింది. ఎన్నికల హడావిడిలో ఉన్న గ్రామ పంచాయతీ సిబ్బంది పైపులైన్ లీకేజీపై పట్టించుకోకపోవడంతో బుధవారం 'మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ' అంటూ వార్తా కథనం ప్రచురితం చేయడంతో స్పందించిన సిబ్బంది మరమ్మతు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు స్పందించేలా 'సాక్షి' కథనం ప్రచురితం కావడం పట్ల ఎస్సీ కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

సైబర్ నేరాలపై అవగాహన



అలంపూర్ రూరల్: మండలంలోని లింగన్‌వాయి గ్రామంలో బుధవారం సైబర్ నేరాల, ట్రాఫిక్ నియమాల పై, రోడ్డు భద్రతపై ప్రజలకు షీ టీం, పోలీస్ కళా బృందం, భరోసా టీం బృందం అవగాహన కల్పించారు. గ్రామంలోని ప్రజలకు ట్రాఫిక్ నియమాలు, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, మూఢ నమ్మకాలు షీ టీమ్స్, డయల్ 100 ప్రాముఖ్యత గురించి, బాధిత మహిళలకు భరోసా కేంద్రం అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వెంకటేష్, రాధమ్మ, షీ టీం కళా బృందం సభ్యులు కృష్ణ, రామంజనేయులు, రాంరెడ్డి, శేషన్న, భరోసా బృందం సభ్యులు శివాణి పాల్గొన్నారు.

లక్ష్యం మేరకు నర్సరీలలో మొక్కలను పెంచాలి

– ఎంపీడీఓ కృష్ణయ్య

మల్దకల్: ప్రభుత్వ లక్ష్యం మేరకు నర్సరీలలో మొక్కలను పెంచి సంరక్షించాలని ఎంపీడీఓ కృష్ణయ్య నర్సరీ నిర్వాహకులకు సూచించారు. బుధవారం మండలంలోని అమరవాయి, బిజ్వారం, మేకలసోంపల్లి, దాసరపల్లి గ్రామాల్లోని నర్సరీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీలలో మొక్కలను పెంచేందుకు త్వరితగతినా బ్యాగ్ ఫీల్లింగ్‌ను పూర్తి చేయాలని ఆదేశించారు. బ్యాగ్‌ఫీల్లింగు పూర్తయిన నర్సరీలలో మొక్కలను పెంచేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. హరితహారంలో నాటిన మొక్కలను పెంచి సంరక్షించాలన్నారు. నర్సరీలలో గతేడాది మిగిలిపోయిన మొక్కలను పెద్ద కవర్లలోకి మార్చాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఏపీఓ స్వామి, టీఏలు, నర్సరీ నిర్వాహకులు పాల్గొన్నారు.

రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళి

- ఊరూరా అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా విగ్రహాలకు పూలమాలలు
- ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో అంబేడ్కర్ చిత్రపటాల వద్ద నివాళులు
- బాబాసాహెబ్ ఆశయాలు సాధించాలని నేతల పిలుపు



గద్వాల ఎంఏఎల్‌డీ కళాశాలలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

గద్వాల రూరల్: ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను ప్రతిఒక్కరు కొనసాగించాలని దళిత ఐక్యవేదిక నాయకులు ఆర్ మోహన్, రమేష్ అన్నారు. బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టీచర్స్ యూనియన్ నాయకులు వెంకటేష్, గోపాల్ పాల్గొన్నారు.

అలంపూర్: బలహీనవర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని వివేకానంద యూత్ సొసైటీ అధ్యక్షుడు సంజీవ నాయుడు అన్నారు. అలంపూర్ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో వివేకానంద యూత్ సొసైటీ అధ్వర్యంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానంద యూత్ సభ్యులు బాబాసాహెబ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. స్వేచ్ఛా, సమానత్వం, సౌభ్రాతృత్వాలకు సముచిత స్థానం కోసం కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో వివేకానంద యూత్ సొసైటీ ఉపాధ్యక్షురాలు కామాక్షి, సభ్యులు ప్రశాంత్, శీను, మల్లికార్జున్, హనుమంతరావు, మహేష్, గోపాల్, వెంకటేష్ ఉన్నారు.

శాంతినగర్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ వర్ధంతి వేడుకలను వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్, మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి, చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కరుణ, నాయకులు సూరి, నాయకులు పాల్గొన్నారు.

మల్దకల్: మండల కేంద్రం, బిజ్వారం, అమరవాయి, మల్దకల్, ఎల్కూరు గ్రామాలలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, గ్రామపంచాయతీ కార్యాలయాలలో అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు నాయకులు వేర్వేరుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆయా పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని చెన్నిపాడు, మానవపాడు, అమరవాయి, పెద్దపోతులపాడు గ్రామాలలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ వర్ధంతి వేడుకలను యువజన అధ్యక్షుడు పురుషోత్తం, బీఎస్పీ మండల అధ్యక్షుడు రవి, చెన్నిపాడు కిరణ్, అబ్రహంలు ఘనంగా నిర్వహించారు.

అయిజ: మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్‌లో వివిధ సంఘాల నాయకులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు అంబేడ్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాయిప్రకాష్, 4వ వార్డు కౌన్సిలర్ నాగమ్మ, వివిధ సంఘాల, పార్టీల నాయకులు మాదన్న, ఆంజనేయులు, ప్రభాకర్, రాజు, శాస్త్రీ, మైనర్ బాబు, అంజిబాబు, కల్లికార్జున్, మహేందర్, మారెప్ప, వెంకటేష్, రవి, అంజి పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండలంలోని తక్కశిల, కంచుపాడు, ఉండవెల్లి, చిన్న ఆముదాలపాడు గ్రామాల్లో అంబేడ్కర్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ ఆశయాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు. మండల కేంద్రంలోని సీఐటీయూ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాలర్పించారు. తక్కశిలలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వెంకటేశ్వర్లు, సీపీఐ నాయకులు మద్దిలేటి, అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

గట్టు: మండల కేంద్రంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బస్టాండ్ ఆవరణలో అంబేడ్కర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మారెన్న, సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీవీ నర్సింహ, ఐద్వా జిల్లా కార్యదర్శి నర్మద, మహిళా సంఘం సభ్యులు అంజలి, సంధ్య, జయలక్ష్మి, సరోజ, దేవి, హమాలీ సంఘం నాయకులు పాల్గొన్నారు. చాగదోణలో ఎమ్మార్పీఎస్ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. గొర్లఖాన్‌దొడ్డిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు.

కేటీదొడ్డి: మండలంలోని పాతపాలెం వివిధ గ్రామాలలో అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నర్సింహులు, దేవేందర్‌రెడ్డి, వీరేష్, దేవన్న, రంగ స్వామి, ఖాజా పాల్గొన్నారు.

ధరూరు: మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని మార్లబీడు, ర్యాలంపాడు గ్రామాల్లో ఎంఆర్‌పీఎస్ నాయకులు, బహుజన నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఆయన అడుగు జాడల్లో నడవాలని సూచించారు.



శాంతినగర్‌లో..



మానవపాడు మండలం చెన్నిపాడులో..



అయిజలో..



కేటీదొడ్డిలో..

వైద్య విద్యార్థికి సత్కారం



వైద్య విద్యార్థిని హారికను సత్కరిస్తున్న తాహేర్

అయిజ: వైద్య విద్యార్థిని హారికను బుధవారం ఆమె నివాసంలో మండల కేంద్రంలోని ఆమె నివాసంలో ఆర్ఎంపీలు సత్కరించారు. ఈ సందర్భంగా వైద్య విదార్థిని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ఉపాధ్యక్షుడు డీఎండీ తాహెర్ శాలువా, పూల మాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు రాజేశ్వర్‌రెడ్డి, శారద దంపతుల ప్రథమ పుత్రిక హారిక 2023 నీట్ సూపర్ స్పెషాలిటీలో ఆల్ ఇండియా 22వ ర్యాంకు సాధించి తెలంగాణకు కేటాయించిన ఒకే ఒక్క పిడియాట్రిక్ న్యూరాలజీ సీటును సాధించడం గర్వకారణం అని కొనియాడారు. కార్యక్రమంలో ఆర్ఎంపీలు వెంకటస్వామి, నవీన్ కుమార్, విద్యార్థిని తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యంత్ర సహాయమేది?

- రైతులకు అందని సబ్సిడీ వ్యవసాయ పరికరాలు
- ఐదేళ్లుగా నిలిచిన ఆధునిక యంత్రాల పంపిణీ
- ఇబ్బందుల్లో అన్నదాతలు
- యంత్రాలను అద్దెకు తెచ్చి సాగుచేస్తున్న వైనం



మానవపాడులో ట్రాక్టర్‌తో పొలం దుక్కిదున్నుతున్న రైతు (ఫైల్)

మానవపాడు: వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను రైతులకు తెలియజేసి తద్వారా అధిక దిగుబడి సాధించి సాగును లాభసాటిగా మార్చడమే ప్రభుత్వాల లక్ష్యం. అందుకు అనుగుణంగా రైతులకు అవసరమైన వ్యవసాయ పనిముట్లు రాయితీపై అందించాల్సి ఉంది. రాయితీపై అందించే వ్యవసాయ పనిముట్లు పంపిణీ రెండేళ్లుగా నిలిచి పోవడంతో రైతులు సాగు సమయంలో యంత్రాలను అద్దెకు తెచ్చి సాగు చేసుకోవాల్సి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. గతంలో వ్యవసాయశాఖ తరుపున రైతులకు ఉపయోగపడే తైవాన్ స్ప్రేయర్లు, విత్తనాలు వెదజల్లే పరికరాలు, నాగళ్లు , నూర్పిడి యంత్రాలు, ట్రాక్టర్లు, రోటోవేటర్, ట్రాక్టర్ నాగళ్లు తదితర పానిముట్లు సబ్సిడీపై అందించేవారు. ప్రస్తుతం రాయితీపై పరికరాలు అందించకపోవడంతో మండల రైతులు వాటికోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వాలు రైతులకు అందించే రాయితీ నిలిపేస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం నుంచి నిధుల రాక ఇవ్వడంలేదా? లేక అధికారుల నిర్లక్ష్యమా.. అర్థం కావడం లేదని రైతులు పేర్కొంటున్నారు.

నిత్యం అధికారులను సంప్రదించడం..

వ్యవసాయ పనిముట్ల కోసం నిత్యం రైతులు వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించడం పరిపాటిగా మారింది. వ్యవసాయ రంగానికి ప్రయోజనం చేకూరే పనిముట్లను అందించాలని మండల రైతాంగ ప్రభుత్వాన్ని కోరుతోంది. ఇంతవరకు రైతులకు సబ్సిడీ ద్వారా అందించే పనిముట్లు అందకపోవడమేమిటో అర్థం కావడం లేదు. రైతులకోసం ఎంతో చేస్తా అంటున్న తెలంగాణ ప్రభుత్వం సబ్సిడీ ద్వారా రైతులకోసం పనిముట్లు అందికపోవడం విడ్డూరం.

గతంలో రాయితీపై అందించిన పనిముట్లు..

మండలంలో గతంలో రైతులకు అవసరమైన పనిముట్లను ప్రభుత్వం పంపిణీ చేసింది. మండలంలో తైవాన్ స్ప్రేయర్లు, ఇనుప నాగళ్లు, రోటోవేటర్, ట్రాక్టర్ నాగళ్లు, కోతయంత్రాలు, గడ్డి కట్టే యంత్రాలు తదితర పనిముట్లను పంపిణీ చేసేవారు. రెండేళ్లుగా మండలంలోని రైతులు నిత్యం కార్యాలయాల చుట్టూ తిరుగుతూ అభ్యర్థిస్తున్న జిల్లా స్థాయిల్లోనే రాలేదని వ్యవసాయ అధికారులు రైతులకు వివరించారు. ఉన్నతస్థాయి అధికారులు, ప్రభుత్వం దృష్టి సారించి ప్రభుత్వం అందించే సబ్సిడీ పనిముట్లను రైతులకు అందించాలని రైతులు కోరుతున్నారు.

ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం..



ప్రభుత్వం రైతులకు రాయితీపై అందించే వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేయాలి. రెండేళ్లుగా పనిముట్లు పంపిణీ నిలిచిపోవడంతో సాగుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. రై తులకు ఎక్కువగా అవసరమైన నాగళ్లు, రోటోవేటర్, ట్రాక్టర్లు సబ్సిడీ ద్వారా రైతులకు ప్రభు త్వం అందించాలని కోరుకుంటున్నాం. రైతులకు పండిన పంటను రక్షించుకోవడానికి టార్పాలిన్లు అవసరం కానీ ఇంత వరకు ప్రభుత్వం అందించలేదు. ప్రభుతం సబ్సిడీపై దృష్టి పెట్టి రైతులకు అందించాలని కోరుతున్నాం.

– మల్లికార్జున్‌రెడ్డి, రైతు మానవపాడు

సబ్సిడీ అందించాలి



ప్రభుత్వం తరుపున రైతు లకు అందించే సబ్సిడీ పనిముట్లు అందించాలి. ట్రాక్టర్లు, రోటోవేటర్, తైవాన్ స్ప్రేయర్ పనిముట్లు రైతులకు ఉపయోగపడే వాటిని సబ్సిడీ ద్వారా రైతులకు అందించాలి. ఇంత వరకు రైతులకు సబ్సిడీ పనిముట్లు ఇవ్వకపోవడం విడ్డూరం. ప్రభుత్వ నిర్లక్ష్యమా? ఉన్నతాధికారుల నిర్లక్ష్యమా అర్థం కావడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సబ్సిడీ పనిముట్లు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

– సంజీవనాయుడు, రైతు గోకులపాడు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా..

రైతులకు రాయితీపై వచ్చే వ్యవసాయ పనిముట్లు ప్రభుత్వం నుంచి రావడం లేదు. ఈ విషయపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మండలం నుంచి నివేదికలు పంపించాం. ప్రభుత్వం నుంచి సమాచారం వచ్చిన వెంటనే రైతులకు తెలియజేస్తాం.

– సుబ్బారెడ్డి, మండల వ్యవసాయ అధికారి మానవపాడు

మెరుగైన విద్య కోసం సహకరించండి



మాట్లాడుతున్న ఎంవీ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ హనిమిరెడ్డి

శాంతినగర్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఎంవీ ఫౌండేషన్ మండల కోఆర్డినేటర్ హనిమిరెడ్డి అన్నారు. వడ్డేపల్లి మండలంలోని జక్కిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో పాఠశాల యాజమాన్య కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ మాట్లాడుతూ విద్యార్థుల హాజరు శాతం పెంచాలని, జండర్ ఈక్వాలిటీ పాటించాలని, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, ఫ్రీ జోన్ విలేజ్, బాల్య వివాహాలు నిర్మూలన గురించి విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులకు వివరించారు. పాఠశాలలో మౌలిక వసతులు, వలస వెళ్లిన విద్యార్థులను బడిలో చేర్పించే విషయమై చర్చించారు. సమావేశంలో ఉపసర్పంచ్ మహానంది, ప్రధానోపాధ్యాయులు కుమార్‌నాయుడు, మాజీ ఉపసర్పంచ్ వెంకటేష్, ఉపాధ్యాయులు రాజు, ఎస్ఎంసీ చైర్మన్ వెంకటేష్‌గౌడ్, సభ్యులు పాల్గొన్నారు.

ఆదిశిలా క్షేత్రంలో కార్తీక మాసం ప్రత్యేక పూజలు



కార్తీక దీపాలను వెలిగిస్తున్న మహిళలు

మల్దకల్: కార్తీకమాసం కావడంతో భక్తులు ఆదిశిలా క్షేత్రానికి పోటెత్తారు. ఈ సందర్భంగా ఆలయంలో మహిళలు కార్తీక దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమరవాయి, తాటికుంట, కుర్తిరావులచెర్వు, పాల్వాయి, బిజ్వారం, పెద్దపల్లి, గ్రామాల్లోని శివాలయాల్లో మహిళలు కార్తీక దీపాలను వెలిగించి పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు, సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ సత్యహరిశ్చంద్రారెడ్డి, అర్చకులు మధుసూదనాచారి, రవిచారి, చంద్రశేఖర్‌రావు, నాగరాజుశర్మ, అరవిందరావు పాల్గొన్నారు.

మంత్రివర్గంలో స్థానం కల్పించాలి



మాట్లాడుతున్న నర్సింహులు

గద్వాల అర్బన్: మక్తల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరుపున ఎమ్మెల్యే గా ఎన్నికైన తెలుగు ముదిరాజ్ కులస్తుడు వాకిటి శ్రీహరికి మంత్రివర్గంలో స్థానం కల్పించాలని తెలుగు ముదిరాజ్ జిల్లా అధ్యక్షుడు నర్సింహులు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగు ముదిరాజ్‌లను బీసీ–డీలో నుంచి బీసీ–ఏలోకి మార్చాలన్నారు. రాష్ట్ర సీఎంగా రేవంత్‌రెడ్డి నియమాకం కావడం పట్ల అభినందించారు. కార్యక్రమంలో తెలుగు ముదిరాజ్ సంఘం నాయకులు జగదీష్, దడవాయి నర్సింహులు, శ్రీనివాసులు, రాఘవేంద్ర, భాస్కర్, కృష్ణ ఉన్నారు.

అయ్యప్పస్వామి ఆలయంలో పడిపూజ

ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప స్వామి మూలవిరాట్ విగ్రహానికి, ఉత్సవ విగ్రహానికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. బుధవారం అ య్యప్ప స్వామికి నెయ్యి, పాలు, తేనెతో, కుంకమ్మ, పసుపు, గంధంతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం సమయంలో 18 మెట్ల పడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మా సంలో మూలవిరాట్ అయ్యప్ప స్వామికి పుష్పాలంకరణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు ఆంజనేయులు, ధర్మకర్త దామోదర్‌రెడ్డి, గురుస్వాములు సూర్యకాంతారెడ్డి, రాములు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి



మున్సిపల్ చైర్మన్ కరుణకు వినతిపత్రం అందజేస్తున్న పైపాడు యువకులు

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పైపాడు కొత్తకొట్టాల కాలనీలో తాగు నీటి స మస్య పరిష్కరించాలని 1,2 వార్డుల ప్రజలు బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణ, కమిషనర్, వైస్ చైర్‌పర్సన్ సుజాతలకు వినతిపత్రం అందజేశారు. కాలనీలో ఏర్పాటు చేసిన ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు మిషన్ భగీరథ నీళ్లు ఎ క్కడం లేదని, తాగు నీటి సమస్య తలెత్తుతోందని, పైపాడు నుంచి రాయచూర్ రోడ్డు వరకు, ఇటు ఈశ్వరమ్మ అవ్వ గుడివరకు రోడ్డు వెంట ఇరువైపుల వీధిలైట్లు లేకపోవడంతో రాత్రి వేళల్లో కాలినడకన గ్రామానికి వచ్చే వారికి ఇబ్బందులు తలెత్తుతున్నాయని వినతిలో పేర్కొన్నారు. ఇటీవల విషసర్పం కాటుకు గురైె ఓ వ్యక్తి ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడని, వెంటనే స్పందించి వీధిలైట్లు ఏర్పాటు చేయడంతో పాటు మోటార్ ఏర్పాటు చేసి మిషన్ భగీరథ నీటిని ఓవర్‌హెడ్ ట్యాంకుకు ఎక్కేలా చూడాలని కోరారు. సానుకూలంగా స్పందించిన చైర్మన్ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని పైపాడు వాసులకు హామీ ఇచ్చారు.

పాఠశాలల్లో వసతుల వివరాలివ్వండి



హాజరైన ఎంఈఓ, నోడల్ అధికారి, హెచ్ఎంలు, ప్రిన్సిపాళ్లు

అలంపూర్: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతుల సమాచార వివరాలు ఇవ్వాలని ఉండవెల్లి ఎంఈఓ శివప్రసాద్ సూచించారు. అలంపూర్ చౌరస్తాలోని వైష్ణవి స్మార్ట్ పాఠశాలలో డైస్ కోడ్ ఒక రోజు శిక్షణ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సమావేశానికి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంఈఓ శివప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలు, గురుకుల, ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో మరుగుదొడ్ల, మూత్రశాలలు, తాగునీటి వసతి, తరగతి గదులు, ప్రహరీ, సైన్స్ ల్యాబులు, క్రీడా మైదానం, క్రీడా సామగ్రి, పాఠశాలల్లో ఉన్న ఫర్నీచర్ వంటి సమగ్ర వివరాలను ఇవ్వాలన్నారు. ప్రతి పాఠశాల, కళాశాల, గురుకుల పాఠశాలల వివరాలు ఖచ్చితంగా ఇవ్వాలన్నారు. సమావేశంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం హేమలత, మండల నోడల్ అధికారి రామకృష్ణ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ వైపే ప్రజలు

కేటీదొడ్డి: రాష్ట్రమంతా కాంగ్రెస్ గాలి వీచినా మండల ప్రజలు బీఆర్ఎస్ వైపే మెజార్టీ ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్న ట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఉరుకుందు, వాల్మీకి సంఘం మండల అధ్యక్షుడు గోవిందు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేసీఆర్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి నాయకత్వంలో మండలంలో జరిగి న అభివృద్ధిని ప్రజలు ఎప్పటికీ మరువరని తెలిపారు. కార్యకర్తలకు అందుబాటులో ఉం టానని పేర్కొన్నారు.